సాక్షి
ఒడిశా

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,37,489లు, బంగారం 330 మిల్లీగ్రాములు, వెండి 8.75 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



మార్కెట్ సదుపాయమే ప్రధానం

- 8లో.



శివరాత్రికి సన్నాహాలు

- 8లో.

న్యూస్‌రీల్

లారీ డ్రైవర్ సజీవ దహనం



డ్రైవర్ సహా మంటల్లో దగ్ధమైన లారీ

భువనేశ్వర్: సంబల్‌పూర్ జిల్లా రెఢాఖోల్ సమీపంలో లారీ బోల్తా పడిన ఘటనలో మంటలు చేలరేగి, డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి, అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక దళం అక్కడికి చేరుకొని మంటలను నియంత్రించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే వాహనం దగ్ధమైంది. రెఢాఖోల్ నకొటి దెవుళో మార్గం తెరబెడ గ్రామ సమీపంలో బోల్తా పడిన 12 చక్రాల లారీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు భావిస్తున్నారు. సజీవ దహనమైన మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు.

వర్చువల్ హైకోర్టులకు నియమావళి జారీ

- తొలి దశలో 10 జిల్లాలకు అవకాశం



భువనేశ్వర్: రాష్ట్రంలోని 10 జిల్లాల్లో ఇటీవల వర్చువల్ హైకోర్టులను అందుబాటులోకి తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. వీటి కార్యాచరణకు నిర్ధారిత కార్యాచరణ మార్గదర్శకాలు(ఎస్‌ఓపీ)ను హైకోర్టు బుధవారం జారీ చేసింది. కేసుల ఈ–ఫైలింగ్ ప్రక్రియ విధానం , పోర్టల్ ద్వారా కోర్టు రుసుము ఈ–చెల్లింపు, ఈ–ఫైలింగ్ కేసుల హైకోర్టు స్టాంప్ రిపోర్టు విధానాలకు సంబంధించిన విధి విధానాలను తెలియజేశారు. ఈ–ఫైలింగ్ ప్రక్రియలో ఏవైనా లోటుపాటులు కేసు నిర్వహించే న్యాయవాది రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు సమాచారం చేరుతుంది. హైకోర్టు వెబ్‌సైట్ అప్లికేషన్‌లో లోటుపాట్లు వివరంగా ప్రసారం చేస్తారు. ఈ–ఫైలింగ్ వ్యవస్థలో లోపాల సవరణకు వీలు కల్పించారు. మధ్యంతర దరఖాస్తులు, పెండింగ్ కేసుల పత్రాలకు ఈ విధానం దోహదపడుతుంది. విచారణ కోసం అత్యవసర కేసుల జాబితా అభ్యర్థన, హైకోర్టు ఆన్‌లైన్ నమోదు పోర్టల్ న్యాయవాదుల అభ్యర్థనకు ఉపకరిస్తుంది. కేసు విచారణ కోసం జాబితా వివరాలు సంబంధిత న్యాయవాది నమోదిత మొబైల్ నంబర్‌కు ఆటోమేటిక్‌గా సమాచారం చేరుతుంది. కేసు వర్చువల్ విచారణకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, హైకోర్టు ఉత్తర్వు/తీర్పు సర్టిఫైడ్ కాపీని పొందే అంశాన్ని ఎస్‌ఓపీలో వివరించారు.

- తొలి దశలో పశ్చిమ ఒడిశా సంబల్‌పూర్, బొలంగీర్, సుందర్‌గఢ్(రౌర్కెలా)
- దక్షిణ ఒడిశా కలహండి(భవానీపట్న), కొరాపుట్(జయపురం), గంజాం(బరంపురం)
- ఉత్తర ఒడిశా బాలాసోర్, భద్రక్
- తూర్పు ఒడిశా ఖుర్దా(భువనేశ్వర్), పూరీ ప్రాంతాల్లో వర్చువల్ హైకోర్టులు ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రాయగడ: రోడ్డు ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించని వాహన దారులపై కొరడా ఝులిపించారు. రాయగడ సబ్ డివిజన్ పరిధిలోని గుమ్మా, తెరువలి, సికరపాయి, టికిరి కూడలి, జిమిడిపట, దుర్గాపాడు, కాసీపూర్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 22మంది వాహనదారుల లైసెన్సులు రద్దు చేశారు. రూ.1,80,500లు అపరాధ రుసుంగా వసూలు చేసినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. అదేవిధంగా గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని విక్రమ్‌పూర్, రామనగుడ, ముచుకిపాదోరో, గుమడ, పుటాసింగి ప్రాంతాల్లో హెల్మెట్ ధరించని పలువురు వాహనదారులపై రూ.1.72 లక్షల జరిమాన విధించారు. బిసంకటక్ సబ్ డివిజన్ పరిధిలో బిసంకటక్, మునిగుడ, అంబాదొల, చంద్రపూర్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, రూ.1.08 లక్షల జరిమాన వసూలు చేసి, 14మందిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

దేశానికి దన్నుగా నిలుస్తాం



భువనేశ్వర్ ఐఐటీలో ఈ-సమ్మిట్ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు



దేశం నలుమూలల నుంచి హాజరైన విద్యార్థులు, యువకులు

- ఈ–సమ్మిట్‌లో ప్రకటించిన ఐఐటీ విద్యార్థులు
- భువనేశ్వర్ క్యాంపస్‌లో జాతీయ స్థాయి సదస్సు
- దేశం నలుమూలల నుంచి హాజరైన విద్యార్థులు
- ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై తమ ఆకాంక్షను వెల్లడించిన యువత

భువనేశ్వర్: 'దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో పాత్రధారులుగా ఎదుగుతాం. యువతరం ఆలోచనలకు విద్యార్థిగా సాధించిన సాంకేతిక పరిజ్ఞానంతో పదును పెట్టి, సృజనాత్మక వ్యవస్థను వెలుగులోకి తెస్తా'మని ఐఐటీ విద్యార్థుల వర్గం సగర్వంగా ప్రకటించింది. భువనేశ్వర్ లోని భారతీయ సాంకేతిక సంస్థ(ఐఐటీ) నిర్వహించిన ఈ–సమ్మిట్ సదస్సులో పాలుపంచుకున్న యువతరం ఈ ఉత్సాహం ప్రదర్శించింది. నిరంతరత–నిరంతర విజయ అనే అంశంపై స్థానిక ఐఐటీ క్యాంపస్‌లో బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా పలు సంస్థల నుంచి కార్యక్రమానికి విచ్చేసిన ఆహుతులతో అనూహ్య స్పందన లభించింది. యువతరం విద్యార్థులతో వర్తక వ్యాపార ప్రముఖులతో స్వయం సహాయక వర్గాలు, స్వచ్ఛంద సేవాసంస్థల విజయ గాథలను ఈ ప్రదర్శనలో విశ్లేషించడం విశేషంగా ఆకట్టుకుంది. విద్యాధిక యువత నిరుద్యోగులుగా మిగిలి పోకుండా ఉద్యోగ వనరులుగా నిలదొక్కుకునేలా మలిచేందుకు ఈ ప్రత్యేక సదస్సు నిర్వహించినట్లు నిర్వాహక సంస్థ డైరెక్టర్ శ్రీపాద కర్మాలకర్ తెలిపారు. దేశవ్యాప్తంగా పేరొందిన సంస్థల నుంచి చురుకైన విద్యార్థి యువత ఈ సదస్సుకు వన్నె దిద్దారని ప్రసంశించారు. పరిసరాలు, దైనందిన జీవనంలో ఎదురవుతున్న పలు సంక్లిష్ట పరిస్థితులకు సాంకేతిక పరిజ్ఞానంతో మలుపు తిప్పి, ఉపాధి వనరులుగా మలిచే దిశలో ఐఐటీ విద్యార్థి సమూహం నడుం బిగించాలని కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఒడిశా కంప్యూటర్ అప్లికేషన్ సెంటర్(ఒకాక్) మేనేజింగ్ డైరెక్టర్ మానసరంజన్ పండా ప్రోత్సహించారు.

సృజనాత్మకత, సాంకేతికతతో..



వ్యాపార రంగం కొత్త పుంతలు తొక్కించేందుకు ఈ సదస్సు ప్రేరేపించింది. పర్యావరణం, సామాజిక పోకడ ప్రామాణికంగా సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞానంతో వినూతన శైలిలో సంస్థాగత కార్యాచరణకు నడుం బిగించే కొత్త స్ఫూర్తిని ప్రేరేపించింది. వ్యాపారం లాభార్జనకు పరిమితం కాకుండా సామాజిక హితవుకు వేదికగా నిలిచే దిశలో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని ఆశిస్తున్నా. యువతకు ఉపాధి, ఉద్యోగం కల్పించే వనరులను అందుబాటులోకి తెచ్చేందుకు సాంకేతిక విద్యాభ్యాసాన్ని సద్వినియోగించుకుంటా.

హెచ్.శ్యామ్, ఐఐటీ విద్యార్థి

ప్రజా సమస్యలే సోపానం..



ఈ–సమ్మిట్ సదస్సు దేశవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం ప్రయోగం కోసం నిరీక్షిస్తున్న నిత్య సమస్యలను వెలుగులోకి తెచ్చింది. ఈ దిశలో సమాజానికి సాంకేతిక సహకారం అందించే వ్యవస్థతో ముందుకు సాగాలనే సంకల్పం బలపడింది. సమాజంలో అట్టడుగు బడుగు జీవికి సాంకేతిక పరిజ్ఞానం అక్కరకు వచ్చేలా సాదాసీదా సంస్థ ఏర్పాటుకు కృషి చేస్తా. సమాజంలో అన్ని వర్గాల పురోగతి, దేశ సమగ్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నా వంతు ప్రయత్నిస్తా.

– డి.అశ్వనాథ్‌రాజ్, ఐఐటీ విద్యార్థి

అనుకున్నది సాధించాలంటే..



విద్యాభ్యాసంతో ఎదుగుదల పరిమితం కారాదు. భావితరాలకు మార్గదర్శకం కావడం ధ్యేయం కావాలి. ఈ దిశలో నిరంతర అన్వేషణ కార్యాచరణగా మలుచుకునే కొత్త స్ఫూర్తిని ఈ–సమ్మిట్ చైతన్య పరిచింది. సాంకేతిక విద్యార్జనే పెట్టుబడిగా సృజనాత్మక భావాల కార్యాచరణతో కృషికి తగిన సత్వర ఫలితం ప్రసాదించే సంస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నా. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన వ్యాపార సంస్థలు, స్వయం ఉపాధి సంస్థలు, దిశ దశ నమూనాగా సరికొత్త వ్యవస్థను సమాజానికి పరిచయం చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

వి.గణేష్, ఐఐటీ విద్యార్థి

సర్వే వేగవంతానికి ఆదేశాలు



సమీక్షలో మాట్లాడుతున్న మేయర్ సంఘమిత్ర, పక్కన కమిషనర్ జెనా

బరంపురం: నగరంలో బీఎంసీ పాలనా యంత్రాంగం చేపట్టిన జోగా మిషన్ సర్వే వేగవంతం చేసి, ఏప్రిల్ 1లోగా పూర్తి నివేదిక అందించాలని మేయర్ సంఘమిత్ర దొళాయి ఆదేశించారు. బరంపురం మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) కార్యాలయ సమావేశ మందిరంలో జోగా మిషన్‌పై కమిషనర్ సోనాల్ జెనా అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బరంపురం నగరంలో రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన సర్వేను అన్ని వార్డుల్లో పూర్తి చేసి, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటి వరకు జరిగిన సర్వేలో 7,334 పేర్లు నమోదు చేశామని తెలిపారు. మిగిలిన లబ్ధిదారుల జాబితా కూడా పూర్తి చేసి, అనంతరం ఎంపికైన వారికి గుర్తింపు పత్రాలు బీఎంసీ యంత్రాంగం తరఫున అందించనున్నట్లు వెల్లడించారు. సమీక్షలో డిప్యూటీ కమిషనర్ వినోద్‌కుమార్ బెహరా, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు నిఖిల్ మిశ్రా, దామోదర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద హరి, రనస్‌పూర్ గ్రామస్తులు

జయపురం: కనీస మౌలిక సౌకర్యాలకు దూరమైన తమ గ్రామంలో వసతులు కల్పించాలని బొరిగుమ్మ సమితి రనస్‌పూర్ పంచాయతీ ప్రజలు కోరారు. ఈ మేరకు సామాజిక కార్యకర్త బి.హరి రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని రాణిగడ్, సొరగిపాదర్, అంబాబలి గ్రామాల్లో రక్షితనీటి సదుపాయం, విద్య, వైద్య, రహదారుల సౌకర్యాలు లేవని వాపోయారు. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్ని వినతులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల డిమాండ్ల సాధనకు బొరిగుమ్మ బీడీఓ కార్యాలయాన్ని ముట్టడించామని, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటి వరకు పట్టించుకో లేదని వివరించారు. ఇప్పటికైనా స్పందించి, ఆదుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో లక్ష్మణ డొరి, ప్రేమచంద్ర ఉమిరియా, హరిశ్చంద్ర ఉమిరియ, దుర్య పొంచియ, పదలామ్ కమర, తిల అమనాత్య, హరి డొరి, కుమ పొంజియ, కుణ ఉమిరియ, బినోద్ గోండ్, సదా ముదిలి, హరి ముదులి, రామ ముదులి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలుగా గుర్తించండి



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సుమని జొడియా, ఎమ్మెల్యే ముదులి తదితరులు

- కేంద్ర ప్రభుత్వానికి సంప్రదాయ జొడియా ప్రజల వినతి
- ఢిల్లీలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ

రాయగడ: జిల్లాలో అత్యధికంగా నివసించే తమను ఆదివాసీలుగా గుర్తించాలని సంప్రదాయ జొడియా ప్రజలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి, వినతిపత్రం అందించారు. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి నేతృత్వంలో కాసీపూర్‌కు చెందిన ఆదివాసీ నాయకురాలు సుమణి జొడియా, ఘాసీన్ జొడియా, గురునాథ్ జొడియా, ఉతాసన్ జొడియా తదితరులు పలు సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. జొడియాలను ఆదివాసీలుగా గుర్తించాలని గత కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని వాపోయారు. జిల్లాలో అత్యధిక శాతం మంది జొడియా సంప్రదాయాన్ని పాటిస్తుంటారని, కాసీపూర్ వంటి మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్నారని తమను ఆదివాసీలుగా గుర్తించక పోవడంతో ప్రభుత్వ పథకాలను దూరమవుతున్నామని తెలిపారు. 1994 వరకు ఈ సంప్రదాయ ప్రజలు ఆదివాసీల జాబితాలో ఉండేవారని, అనంతరం తొలగించడంతో అన్ని విధాలా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు చదువులు, ప్రభుత్వ ప్రత్యేక పథకాలకు అర్హులుగా మిగిలి, ఆర్థిక, సామాజిక రంగాల్లో దయనీయ పరిస్థితిలో ఉన్నామని వివరించారు. దీనిపై స్పందించి, ఆదివాసీలుగా గుర్తించాలని విన్నవించారు. స్పందించిన ధర్మేంద్ర ప్రధాన్.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

94 కిలోల గంజాయి స్వాధీనం



ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో పట్టుబడిన నిందితులు, గంజాయి

- నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

పర్లాకిమిడి: గజపతి, గంజాం జిల్లాల్లో ఎక్సైజ్, పోలీసు సిబ్బంది నిర్వహించిన దాడుల్లో రూ.13 లక్షల విలువైన 94 కిలోల గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పర్లాకిమిడికి 5కిలోమీటర్ల దూరంలోని గుసాని సమితి దేవతి గ్రామం వద్ద దీపక్ బాల్ అనే వ్యక్తి కారులో 12.4 కిలోల గంజాయి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. అలాగే స్థానిక కొత్తబస్టాండ్ వద్ద జోగు అంతాల్(22) 6.6 కిలోల గంజాయిని బస్సులో రవాణా చేస్తుండగా ఎక్సైజ్ సిబ్బందికి చిక్కాడు. రాయగడ బ్లాక్ అడాసింగి జంక్షన్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో 50కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, ఎక్సైజ్ ఎస్పీ ప్రభాత్‌కుమార్ శెఠి సూచన మేరకు బుధవారం కోర్టులో హాజరు పరిచారు. మొత్తం సరుకు విలువల రూ.9 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.దాడుల్లో ఎస్ఐ స్మితా పండా, ఏఎస్ఐలు సుస్మితా నాయక్, లింగరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



బరంపురం: పోలీసులకు పట్టుబడిన గంజాయితో నిందితుడు

రూ.4 లక్షల విలువైన..

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 25 కిలోల గంజాయిని సురడా పోలీసు స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అరెస్ట్ చేశారు. కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సురడా పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. అటుగా వస్తున్న కారులో 25 కిలోల గంజాయిని గుర్తించి, డ్రైవర్‌ను అరెస్ట చేశారు. పట్టుబడిన సరుకు విలువ రూ.4 లక్షలు ఉంటుందని ఐఐసీ తెలిపారు.

పేట్రేగిపోతున్న దొంగలు

- రాయగడ రింగ్ రోడ్డులో మరో చోరీ

రాయగడ:

పట్టణంలో గత కొద్ది రోజులుగా చోటు చేసుకుంటున్న వరుస చోరీలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఒకవైపు మహిళలే లక్ష్యంగా వారి మెడలోని బంగారు ఆభరణాలను అపహరిస్తుండగా, మరోవైపు తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దోచుకుపోతున్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని రింగ్ రోడ్డులో నివసిస్తున్న పి.బంగారయ్య ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాను విరగ్గొట్టారు. అందులోని రూ.10 వేల నగదు, 500 గ్రాముల వెండి, 7 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకు పోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు ప్రారంభించారు. ఎస్‌డీపీఓ దేవజ్యోతి దాస్, ఐఐసీ రస్మిరంజన్ ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం బాధితుడు బంగారయ్య కుటుంబంతో కలిసి ఈనెల 5న తన బంధువుల ఇంటికి వెళ్లాడు. విషయాన్ని పసిగట్టిన దుండగులు ఇంటి వెనుక వైపు ఉన్న కిటికీని చాకచక్యంగా తొలగించి, లోపలకు ప్రవేశించారు. బీరువాలోని సొత్తును దోచుకొని, పరారయ్యారు. బుధవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన ఇరుగు–పొరుగు వారు బంగారయ్యకు, పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు, సైంటిఫిక్ బృందం.. దొంగల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. బాధితులు వచ్చిన అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా వరుస దొంగతనాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. చోరీలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చిందర వందరగా పడి ఉన్న బీరువాలోని సామగ్రి



కిటికి తొలగించి దుండగులు చొరబడిన మార్గం

న్యూస్‌రీల్

104 జిల్లా మేనేజర్‌గా దుర్గాప్రసాద్



కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను కలిసిన డీఎమ్ దుర్గాప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో 104 వాహనాల జిల్లా మేనేజర్‌గా పి.వెంకటదుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ నిషాంత్ కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 104 సేవలు మరింత మెరుగ్గా అందించాలని కలెక్టర్ సూచించారు. ఆయన విజయనగరం జిల్లాలో పనిచేస్తూ పదోన్నతిపై జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

తలలేని దూడ జననం



తలభాగం లేని ఆవుదూడ

సీతంపేట: మండలంలోని కొత్త పనుకువలసలో ఎస్.తిరుపతిరావు అనే రైతుకు చెందిన ఆవు తలభాగం లేని దూడకు బుధవారం జన్మనిచ్చింది. భూమిపై పడిన వెంటనే చనిపోయిందని రైతు తెలిపారు. జన్యుపరమైన లోపాలు కారణంగా తలభాగం తయారు కాలేదని స్థానిక పశుసంవర్థకశాఖ ఏడీ శ్రీనివాసరావు తెలిపారు.

ఉత్తరాంధ్రస్థాయి నాటక పోటీలకు ఆహ్వానం



నాటక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌వీఆర్ కళాపరిషత్ సభ్యులు

రాజాం సిటీ: సలాది వెంకటరమణ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉత్తరాంధ్రస్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నట్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలాది తులసీదాస్, ఆర్నెపల్లి వెంకటనాయుడు తెలిపారు. పోలిపల్లి పైడితల్లి ఆలయ ఆవరణలో నాటక పోటీల కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా పైడితల్లి జాతరను పురస్కరించుకుని నాటకాల్లోని పలు సన్నివేశాల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పౌరాణిక, జానపద, సాంఘిక, ఏకపాత్రాభినయంలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతితో పాటు ప్రదర్శన పారితోషికం అందిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన కళాకారులు ఈ నెల 15లోగా ఎంట్రీలను ఆర్నిపల్లి వెంకటనాయుడు, ప్రధాన కార్యదర్శి, ఎస్‌వీఆర్ కళాపరిషత్, అమ్మవారికాలనీ చిరునామాకు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 94417 56874 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఒడిశా నుంచి మరో గజరాజుల గుంపు

- రాత్రంతా తరలించిన ఒడిశా అటవీ సిబ్బంది
- మనుమకొండ సమీపంలో 6 ఏనుగుల గుంపు



ఒడిశా నుంచి మండలంలోకి ప్రవేశించిన ఆరు ఏనుగుల గుంపు

భామిని: భామిని మండలానికి ఒడిశా నుంచి మంగళవారం రాత్రి మరో ఏనుగుల గుంపు వచ్చింది. ఇప్పటికే పసుకుడి వద్ద నాలుగు ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇప్పుడు వంశధార నది ఆవల ఉన్న ఒడిశా గ్రామాల నుంచి మనుమకొండ సమీపంలోకి ఆరు ఏనుగులు చేరాయి. రాత్రంతా ఒడిశా అటవీశాఖాధికారులు కాగడాలు, మందుగుండు పేల్చుతూ నేరడి-బ్యారేజ్ వద్ద వంశధార నదిని దాటించి ఆంధ్రావైపు తరిమారు. దీంతో నదీతీర గ్రామమైన నేరడి-బి గ్రామస్తులు భయంభయంతో కాలం వెల్లదీస్తున్నారు. అరటితోటలు, కొబ్బరి చెట్లు, వ్యవసాయ బోర్లను కొత్త ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. పంటలకు నష్టం కలిగించాయి.

ఏనుగుల తరలింపునకు చర్యలు

కొమరాడ: మన్యం జిల్లాల్లో తిష్ట వేసిన గజరాజులు గుంపు తరలింపునకు చర్యలు చేపట్టామని అటవీశాఖ సీసీఎఫ్ కాంత్‌నాథ్ రెడ్డి అన్నారు. ఏనుగులు సంచరిస్తున్న కుమ్మరిగుంట, దుగ్గి, కళ్లికోట, గుణానపురం తదితర గ్రామాలను బుధవారం పరిశీలించారు. జంఝావతి రబ్బర్ డ్యామ్, ఆర్తాం రిజర్వ్ ఫారెస్టులకు ఏనుగులను మళ్లించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయన వెంట జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన, రేంజర్ త్రినాథ్‌రావు, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

మార్కెట్ సదుపాయమే ప్రధానం

- సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు కేంద్రం ప్రోత్సాహం
- కటక్ ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ పీకే గుప్తా



వేదికపై ఎంఎస్‌ఎంఈ శాఖ అధికారులు



సదస్సుకు హాజరైన పారిశ్రామిక వేత్తలు, ఉత్పత్తిదారులు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ గుప్తా

జయపురం: సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తులకు అవసరమైన మార్కెట్ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కటక్ ఐసీడీఎస్ జాయింట్ డైరెక్టర్ పీకే గుప్తా తెలిపారు. పట్టణంలోని గాంధీ కూడలి సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఎంఎస్‌ఎంఈ, జయపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్, కొరాపుట్ జిల్లా జీడిపప్పు తయారీ సంఘం సహకారంతో మార్కెటింగ్ విధానంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఉత్పత్తులకు తగిన మార్కెట్ కల్పించినప్పుడే ఉత్పత్తుదారులు, వ్యాపారులు లబ్ధి పొందగలరన్నారు. తదనుగుణంగా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి కేంద్రప్రభుత్వం చేపడుతున్న పథకాలు, నియమ, నిబంధనలను వివరించారు. అంతకుముందు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) సునాబెడ డిప్యూటీ జనరల్ మేనేజర్ దిగంబర ప్రధాన్ జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. భువనేశ్వర్‌కు చెందిన మోహో డిజైన్ స్టూడియో అమిత్‌కుమార్ దాస్ డిజిటల్ మార్కెటింగ్‌పై, విశాఖపట్నం నోవల్ పేటెంట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ ఎస్‌వీఎన్ రాజు ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, టూల్స్ పైన అవగాహన కల్పించారు.

ప్రత్యేక ప్రోత్సాహం అందించాలి..

కొరాపుట్ జిల్లా జీడిపప్పు తయారీ సంఘం అధ్యక్షుడు జామి రమేష్ మాట్లాడుతూ ఒకప్పుడు కొరాపుట్ జిల్లా జీడి ఉత్పత్తి పరిశ్రమకు ప్రథమ స్థానంలో ఉండేదని గుర్తుచేశారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో జీడిమామిడి తోటలు ఎక్కువగా ఉండేవని, ఎగుమతులు కూడా గణనీయంగా జరిగేవని తెలిపారు. అయితే ప్రభుత్వ నిర్ణయాల కారణంగా ప్రస్తుతం జీడి సాగు తగ్గిపోయిందని, తద్వారా పరిశ్రమలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి, జిల్లాలో జీడితోటలు విస్తరింప జేసేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అలాగే ఉత్పత్తులకు డిజిటల్ మార్కెట్ సదుపాయం కల్పించాలన్నారు. ఓఏస్‌ఎంఈ అధ్యక్షుడు అనూప్‌కుమార్ పాత్రో మాట్లాడుతూ జయపురం సబ్ డివిజన్‌లో 90శాతం పంట భూములకు సాగునీటి వనరులు ఉన్నాయని, అయితే ఉత్పత్తులకు తగిన మార్కెట్ లేదన్నారు. దీనివల్ల సాగుదార్లు నష్టపోతున్నారని తెలిపారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అధికారి సాహు, డీఎఫ్ఓ కటక్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎన్ నాయక్, డాక్టర్ అనుపమ్ గాయెన్ తదితరులు ప్రసంగించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్, రీజనల్ అధికారి ఎన్.నటరాజ్ ప్యాకింగ్ విధానంలో సాంకేతికతను వివరించారు. ఎంఎస్‌ఎంఈ జెమ్ రిజిస్ట్రేషన్ అధికారి పవిత్రకుమార్ శత్పతి మార్కెటింగ్ సహాయక పథకాలను తెలియజేశారు. సదస్సులో 120 మంది పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నట్టు నిర్వాహకులు వెల్లడించారు.

శివరాత్రికి సన్నాహాలు



మహేంద్రగిరి ఆలయం, పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

- 16 నుంచి 18 వరకు మహేంద్రగిరిపై మహాశివరాత్రి ఉత్సవాలు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ పండా, ఎస్పీ స్వాతి



మహేంద్రగిరిపై ఉన్న పురాతన కుంతీ మందిరం

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ కోయిపూర్‌లో ప్రసిద్ధి చెందిన మహేంద్రగిరి పర్వతాన్ని కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఆర్‌డీఏ పీడీ రోమాంచల్ ఖమారి బుధవారం సందర్శించారు. ఈనెల 16 నుంచి 18 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాల సందర్భంగా కొండపై చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. యాత్రకు వచ్చే భక్తులు, సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గత రెండేళ్లు కరనా కారణంగా శివరాత్రి రోజు మహేంద్రగిరి కొండపైకి రాకపోకలు నిషేధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గజపతి, గంజాం, రాయగడ జిల్లలతో పాటు, సరిహద్దు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ నుంచి వేలాది మంది భక్తులు రానున్నట్లు అంచనా వేశారు. వారికి అసౌకర్యం కలుగకుండా, శాంతి భద్రతలకు విఘాతం లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్కింగ్, తాగునీరు, వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పరిశీలనలో డిప్యూటీ కలెక్టర్ నటబర గరోడో, రాయఘడ బ్లాక్ చైర్మన్ పూర్ణబాసి నాయక్, రాయఘడ ఐఐసీ ఆనంద్‌చరణ్ పాత్రో, బీడీఓ రాజారంజిత్ ప్రతాప్ బల్, తహసీల్దార్ లీలావతి, అంతర్యామి గమాంగో తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాగునీటి పక్షోత్సవాలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

- హాజరైన కలెక్టర్ లింగరాజ్ పండా



ఉద్యానవన శాఖ స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: జలసంపద విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఎత్తిపోతల శాఖ డివిజన్ కార్యాలయం ఆవరణలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి సాగునీటి సంఘాలు(పాణి పంచాయతీ) పక్షోత్సవాలు బుధవారం ముగిసాయి. కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మోహానా ఎమ్మెల్యే దాశరథి గమాంగో, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరు కాగా.. ఒడిశా ప్రభుత్వ జలసంపద ప్రత్యేక కార్యదర్శి బిశ్వజిత్ బిశ్వాల్, డీఆర్‌డీఏ పీడీ రమాంచల్ ఖమారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కైలాష్‌చంద్ర బెహరా, పశు సంవర్ధకశాఖ అధికారి గిరీష్‌కుమార్ మహంతి, జలఛాయ, మట్టి సంరక్షణ అధికారి సురేష్‌కుమార్ పట్నాయక్, సాగునీటి సంఘాల రైతులు పాల్గొన్నారు. గజపతి జిల్లాలో భారీ నీటిపారుదల శాఖ ఆధీనంలో 144, ఎత్తిపోతల శాఖలో 414 సాగునీటి సంఘాలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జలసంపద విభాగంలో చేపల పెంపకం, వ్యవసాయం, ఉద్యానవనాలు తదితర విభాగాల ఇంజినీర్లు, అధికారులు నీటి వినియోగంలో నిర్దిష్ట ప్రణాళికలు అవలంబించాలని సూచించారు. నీటిపారుదల శాఖ, ఏఈ సంజయ్‌కుమార్ రథో అతిథులు, రైతులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా, మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే రైతు సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించిన అధికారులు.. వారిని అభినందించారు.

ట్రాకర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుల కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న సీసీఎఫ్ కంఠనాథరెడ్డి

పార్వతీపురంటౌన్: ఇటీవల భామిని మండలం పసుకుడి గ్రామం వద్ద ఏనుగుల దాడిలో ఎలిఫెంట్ ట్రాకర్ లోకొండ లక్ష్మీనారాయణ, గతంలో కొమరాడ వద్ద జరిగిన ఘటనలో జి.చిన్నారావు అనే రైతు మృతిచెందిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబ సభ్యులకు చెరో రూ.2.50లక్షలు చొప్పున రూ.5లక్షలను జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన ఆధ్వర్యంలో ప్రభుత్వం తరఫున అందాల్సిన ఎక్స్‌గ్రేషియా చెక్కులను సీసీఎఫ్ కంఠనాథ రెడ్డి డీఎఫ్ఓ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఏనుగుల దాడిలో ట్రాకర్‌లు చనిపోవడం బాధాకరమన్నారు.

'పట్టణాభివృద్ధిలో మేము సైతం'



జయపురం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

జయపురం: సమాజ ఉన్నతి, పట్టణ అభివృద్దే ప్రధాన లక్ష్యంగా పని చేస్తామని జయపురం ప్రెస్‌క్లబ్ స్పష్టం చేసింది. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జయపురం పరిస్థితులు, అభివృద్ధి తదితర విషయాలపై చర్చించరు. ఉన్నతికి తమవంతు భూమిక నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే ప్రెస్‌క్లబ్‌ను ఎలా బలోపేతం చేయాలి? దీనికి చేపట్టాల్సిన అంశాలను ప్రస్తావించారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలో అధ్యక్షుడిగా పవన్ పాణిగ్రహి, ఉపాధ్యక్షుడిగా రత్నాకర సాహు, సాధారణ కార్యదర్శిగా సురేష్‌కుమార్ నాయుడు, సహాయ కార్యదర్శిగా పద్మనాభ హొత్తా, కోశాధికారిగా తరుణ్‌కుమార్ మహాపాత్రొ, సలహాదారులుగా వి.భాస్కరరావు, సుభాష్‌దాస్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రబి నాయక్, సత్యనారాయణ పట్నాయక్ నియమితులయ్యారు.

కలప మాఫియాపై అధికారుల దాడులు



కళ్లికోట్ అటవీ ప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది గుర్తించిన కలప



గోదాంలో పట్టుబడిన కలపను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

- రూ.లక్షల విలువైన కలప దుంగలు స్వాధీనం

బరంపురం: మొక్కలు నాటి పచ్చదనం, ప్రకతిని పరిరక్షించుకుందామని ఒకవైపు నాయకలు ప్రసంగాలు చేస్తుండగా, మరోవైపు గంజాం జిల్లాలో అటవీ సంపదను దోచుకుంటున్న కలప మాఫియా అగడాలకు అడ్డే లేకుండా పోయింది. కళ్లికోట్ కన్నరియాబడి అటవీ ప్రాంతంలో భారీ వృక్షాలను నరికి, అటవీ సంపదను దోచుకుంటున్న ముఠాపై బుధవారం జిల్లా అటవీశాఖ అధికారులు దాడులు చేశారు. రూ.లక్షల విలువైన భారీ కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడికి సమీపంలో నిల్వ ఉంచిన గోదాంపై దాడి చేసి, కలపను సీజ్ చేశారు. అయితే అధికారులు ఏ ఒక్కరినీ అరెస్ట్ చేయకపోవడంపై స్థానికంగా అనుమానాలు రేగుతున్నాయి.

ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలకు రెట్టింపు నిధులు

- ఎమ్మెల్యే జోగారావు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, నాయకులు

పార్వతీపురం: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. పాలకులు, అధికారులు గుర్తించిన సమస్యల పరిష్కారానికి సచివాలయం వేదికగా రూ.20 లక్షలను కేటాయిస్తోంది. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో ఈ నిధుల మొత్తాన్ని రెట్టింపు (రూ.40లక్షలు) చేయడంపై పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు హర్షం వ్యక్తంచేశారు. దీనికి కృతజ్ఞతగా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో పూలమాల, దుశ్శాలువతో సత్కరించారు. వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలను మరింత అభివృద్ధి చేసేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అభివృద్ధి నిధులు రెట్టింపు చేయడంలో ముఖ్య పాత్ర పోషించిన కలెక్టర్ సేవలను ప్రశంసించారు. నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వానపల్లి శంకరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మువ్వల సత్యంనాయుడు, మజ్జి శేఖర్, అల్లం వెంకట్రావు, ఎస్.సందీప్‌కుమార్, బి.సింహాచలం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉడికీఉడకని ఆహారం తినడంతో..

38 మంది విద్యార్థులకు అస్వస్థత

- కోనయూపీ పాఠశాలలో ఘటన
- స్పందించిన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- పాఠశాలకు చేరుకున్న ఇన్‌చార్జి డీఈఓ, డీఎంహెచ్‌ఓ
- విద్యార్థులకు మక్కువ పీహెచ్‌సీలో వైద్యసేవలు
- కోలుకుంటున్న విద్యార్థులు



108 వాహనంలో మక్కువ పీహెచ్‌సీకు తరలిస్తున్న వైద్యసిబ్బంది



ఉడికీఉడకని వెజ్‌బిరియానీ



పాఠశాల వద్ద గుడిగూడిన విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు



దర్యాప్తు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి డీఈఓ, డీఎంఅండ్‌హెచ్‌ఓ



పాఠశాలలో ప్రథమచికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

మక్కువ: మక్కువ మండలం కోన గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉడికీఉడకని వెజ్‌బిరియానీ, కలుషిత నీరు తాగిన 38 మంది విద్యార్థులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. కొందరు కడుపునొప్పితో బాధపడ్డారు. సమాచారం తల్లిదండ్రులకు తెలియడంతో ఆందోళనకు గురయ్యారు. పాఠశాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. విషయం ఫోన్‌లో తెలుసుకున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర సూచనలతో ఇన్‌చార్జి డీఈఓ బ్రహ్మాజీరావు, డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కరరావు, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీడీఓ పి.దేవకుమార్, ఎస్‌ఐ జి.పైడిరాజు సైతం పాఠశాలకు చేరుకున్నారు. ఏడు 108 వాహనాలు, ఒక 104 వాహనం, ఆటోల్లో 38 మందిని మక్కువ పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించారు. మరికొందరు విద్యార్థులకు పాఠశాలలోనే వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉండడం, ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉడకని వంటలే కారణం..

పాఠశాలలో 144 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి మధ్యాహ్నభోజనం కింద వెజ్‌బిరియానీ, ఉడికించిన కోడిగుడ్డు, శనగచెక్కి, బంగాళదుంప కుర్మాను భోజన నిర్వాహకురాలు తయారు చేశారు. వెజ్ బిరియానీ వండుతుండగా మధ్యలో గ్యాస్ అయిపోయింది. మరో గ్యాస్ సిలిండర్ తెచ్చి మరోమారు వెజ్‌బిరియానీను ఉడికించి, విద్యార్థులకు వడ్డించారు. అయితే, వెజ్‌బిరియానీ, క్యారెట్, బీట్‌రూట్ సరిగా ఉడకపోవడంతో పాటు, కలుషిత నీరు వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. హెచ్‌ఎం జయకుమార్‌తో వాగ్వాదానికి దిగడంతో ఎస్‌ఐ పైడిరాజు సముదాయించారు. హెచ్‌ఎం, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను డీఈఓకు అందిస్తామని ఇన్‌చార్జి డీఈఓ బ్రహ్మాజీరావు తెలిపారు.

తప్పెవరిది?

పాఠశాల హెచ్‌ఎం పి.జయకుమార్ క్లాస్‌బేస్‌డ్ ఎస్సెస్‌మెంట్-2 పేపర్ల కోసం ఎమ్మార్సీ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా ఉపాధ్యాయుడు జగదీశ్‌కు భోజన పథక బాధ్యతలు అప్పగించారు. టేస్టింగ్ ఇన్‌చార్జిగా సూరిబాబు బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యాయుడు సూరిబాబు మధ్యాహ్నభోజన వంటకాలను రుచిచూసి, ఆమోదం తెలిపిన తర్వాత విద్యార్థులకు వడ్డించాల్సి ఉంది. వెజ్‌బిరియానీ ఉడకలేదని ఫోన్‌లో హెచ్‌ఎం జయకుమార్‌కు ఆయన సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జి హెచ్‌ఎంగా ఉన్న జగదీశ్ కూడా ఉడకలేదని భోజన నిర్వాహకులకు తెలియజేశారు. హెచ్‌ఎం పాఠశాలకు చేరుకునేలోపు కొంతమంది విద్యార్థులకు భోజన నిర్వాహకులు వడ్డించారు. వారు కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురికావడంతో మిగిలిన విద్యార్థులు ఆహారం తీసుకోలేదు. అలాగే, పాఠశాల నీటి ట్యాంకు పరిశుభ్రతా లోపంతో నీరు కలుషితమైందని, ఇది కూడా విద్యార్థులు అస్వస్థతకు ఓ కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు.

క్లుప్తంగా

రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలకు రమ్యశ్రీ



రమ్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

శ్రీకాకుళం: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రోలర్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థిని ఆర్.వి.రమ్యశ్రీ ఎంపికయ్యారు. ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ నిర్వహిస్తున్న పోటీలకు ఈమె ఎంపికైనట్టు మెడికల్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ బి.గౌరినాయుడు బుధవారం తెలిపారు. పోటీల్లో చక్కని ప్రతిభకనబర్చి విజయంతో తిరిగి రావాలని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కోటేశ్వరరావు, స్పోర్ట్స్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివ ప్రసాద్ ఆకాంక్షించారు. రమ్యశ్రీని అభినందించారు.

తగ్గిన రహదారి ప్రమాదాలు

- జిల్లా ఉపరవాణాశాఖాధికారి శ్రీదేవి

శ్రీకాకుళం రూరల్: 'రహదారి భద్రత మీ జీవితానికి సురక్ష' నినాదంతో శ్రీకాకుళం జిల్లా రవాణాశాఖా చేపట్టిన ప్రత్యేక అవగాహన సదస్సులు, ర్యాలీలు, సభలతో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని జిల్లా ఉప రవాణా శాఖాధికారి సీహెచ్ శ్రీదేవి బుధవారం తెలిపారు. ప్రమాదరహిత సమాజం కోసం అన్ని వర్గాల సహకారాన్ని తీసుకొని సురక్షిత, ప్రమాదరహిత జిల్లాగా తయారు చేయడం తమ కర్తవ్యమన్నారు. భద్రతా వారోత్సవాలను మొక్కుబడిగా నిర్వహించకుండా ఒక నిరంతర ప్రక్రియగా చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యాలయాలు, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ కాలేజీల్లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. పోలీస్, ఆర్టీసీ, రహదారి, భవనాల శాఖల సహకారాన్ని తీసుకొని ప్రత్యేక కార్యక్రమాలు చేశామన్నారు. గతంలో జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు జరిగేవని, ఇటీవల జిల్లా కలెక్టర్ సహకారంతో ప్రమాదాల నివారణపై ప్రత్యేక డ్రైవ్ కొనసాగించామన్నారు. గతంలో నెలకు సుమారు 30 ప్రమాదాలు జరిగితే ప్రస్తుతం 10 నుంచి 15 ప్రమాదాలు జరుగుతున్నట్టు పేర్కొన్నారు.

ముగ్గురు ఏసీబీ హెచ్‌సీలకు పోలీస్ సేవా పతకాలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలువురిని పోలీస్ సేవా పతకాలకు ఎంపిక చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో ఏసీబీలో హెడ్ కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వహిస్తున్న రోణంకి రమణయ్య, జి.హెచ్.ఎస్.రవిబాబు, కె.రామకృష్ణలను ఎంపిక చేశారు. సేవా పతకాలకు ఎంపికవ్వడం పట్ల ఆ శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేర నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

కవిటి: జిల్లాలో నేరాల నియంత్రణ పట్ల పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా నేర విభాగం అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ అన్నారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా కవిటి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. జిల్లాలో అతి తక్కువ క్రైం రేట్ కలిగిన మండలాల్లో కవిటి మండలం ప్రత్యేకత నిలుపుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది నమోదైన కేసుల్లో 75 శాతం పరిష్కారానికి నోచుకున్నాయని చెప్పారు. ప్రధానంగా అక్రమ మద్యం అదుపు విషయంలో కేసుల నమోదు విస్తృతి పెంచి నిఘా తీవ్రతరం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం సీఐ ఆర్‌ఈసీహెచ్ ప్రసాద్, కవిటి ఎస్ఐ కె.రాము పాల్గొన్నారు.

భూకంప బాధితుల సమచారమివ్వండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల టర్కీ, సిరియా ప్రాంతాల్లో జరిగిన భూకంపం ఘటనల్లో పెద్ద సంఖ్యలో జన నష్టం జరిగిందని, ఆయా దేశాల్లో శ్రీకాకుళం జిల్లా వాసులు ఎవరైనా ఉంటే కుటుంబ సభ్యులు సమీప తహసీల్దార్లకు తెలియజేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీకాకుళం అర్బన్: విజయనగరం జోన్ పరిధిలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆర్టీసీ జోన్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్ అన్నారు. బుధవారం విజయనగరం జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్, డిప్యూటీ సీపీఎం సుధాబిందు, ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కేజే సుభాకర్, వర్కింగ్ అధ్యక్షుడు కె.శంకరరావు, జోనల్ కార్యదర్శి బాసూరు కృష్ణమూర్తి, జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ నారాయణ, వర్క్‌షాప్ రీజన్ అధ్యక్షులు కె.ఎ.రాజు, వర్క్ షాప్ రీజనల్ కార్యదర్శి వి.ఎర్రంనాయుడులు గతంలో ఇచ్చిన సమస్యలపై చర్చలు జరిపారు. ఓటీ డ్యూటీలు, శ్రీకాకుళం రెండో డిపోలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు, బదిలీలు, పదోన్నతులు, ఏఏఎస్ ఇంక్రిమెంట్లు తదితర అంశాలను ఈడీ దృష్టికి తీసుకొచ్చారు.

మన జ్ఞాపకాలు, మన విశేషాలు, విజయాలు పది కాలాల పాటు పదిలంగా దాచుకునే అవకాశం ఫొటోలు, వీడియోలు, రచనలు, పుస్తకాల ద్వారానే లభిస్తుంది. అయితే అవి మన వద్దా.. మనకు, మన గురించి తెలిసిన వారి వరకే అవి అందుబాటులో ఉంటాయి. అదే మన ప్రాంత వైశిష్ట్యం, పోరాట చరిత్ర, సంప్రదాయాలు నిరంతరం మనతోపాటు, మన సమాజం కళ్లెదుట ఉండాలంటే ఎలా? మన విజయాలు, ఇప్పుడు మన మధ్య లేని ప్రముఖుల గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయడం, భావితరాలకు అందించడం ఎలా? దానికి ఒకే ఒక మార్గం ఉంది. ఆ అద్భుత అవకాశాన్ని పోస్టల్ శాఖ కల్పిస్తోంది. ప్రత్యేకంగా పౌరులే తమ ద్వారా తాము కోరుకున్న వ్యక్తులు, ప్రాంతాలు, విశిష్టతలతో పోస్టల్ స్టాంపులు, కవర్లు వేయించుకునే అవకాశం కల్పిస్తోంది. తద్వారా మనం కోరుకున్న అంశాలు చిరస్థాయిగా నిలిచిపోయేలా సహకరిస్తోంది. - శ్రీకాకుళం డెస్క్







ఆధ్యాత్మిక 'ముద్ర'.. జిల్లాను దేశ పటంలో ప్రత్యేకంగా నిలిపిన శతాబ్దాల చరిత్ర గలిగిన శ్రీకూర్మం, అరసవల్లి దేవాలయాల చిత్రాలను 2013లో స్టాంప్ రూపంలో తీసుకొచ్చింది. వాటి విశిష్టతలను ప్రపంచానికి మరోసారి తెలియజెప్పింది.

తపాలా గుండెలపై సిక్కోలు ముద్రలు

- ప్రముఖుల పేరిట తపాలా కవర్ల ముద్రణ
- చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలపై స్టాంప్‌లు

శ్రీకాకుళం అంటే ఓ చరిత్ర. ఓ ఉద్యమం. కష్టజీవుల ఇలాకాగా.. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే ప్రాంతంగా.. చారిత్రాక ఘటనలకు వేదికగా నిలిచిన ప్రాంతం. ఎన్నో విశిష్టతల సమాహారం. వీటినే.. ఈ సంగతుల్నే.. ఈ చారిత్రక గురుతుల్నే.. ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు ప్రయత్నం చేస్తోంది పోస్టల్ శాఖ. తపాలా సేవల్లో చారిత్రక, పేరెన్నిక గన్న విశిష్టతల్ని స్టాంప్‌లు, కవర్లపైన ముద్రించి నేటి తరానికి నాటి సంగతుల్ని పరిచయం చేస్తోంది.

ఎందుకీ ప్రయత్నం..

భారత ప్రభుత్వం జీఐ ఉత్పత్తులతో పోస్టల్ ప్రత్యేక కవర్లు తయారు చేసుకోవాలని సూచించిందని దీంతో చారిత్రక ఆధారాలున్న, రాష్ట్రంలో ప్రత్యేకంగా తయారవుతున్న వస్తువులు, గొప్ప వ్యక్తులు, చూడదగిన ప్రదేశాలతో ప్రత్యేక పోస్టల్ కవర్లు ఆవిష్కరిస్తున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

రూ.25 వేల వరకు ఖర్చు..

ఏదైనా విశిష్టతలకు సంబంధించిన ప్రత్యేక కవర్ విడుదల చేసేందుకు పోస్టల్ శాఖకు రూ.25 వేల వరకు చెల్లించాలి. ముందుగా విశిష్టతలను వివరిస్తూ పోస్టల్ శాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని.. ఉన్నతాధికారులు పర్యవేక్షణ అనంతరం అర్హతలను బట్టి అనుమతి లభిస్తుందని శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్ వివరించారు. ఆవిష్కరణ సభ పోస్టాఫీస్ పరిసరాల్లో నిర్వహిస్తే రూ.12,500 చెల్లిస్తే సరిపోతుందన్నారు. మనకు నచ్చిన ప్రాంతాల్లో నిర్వహించాలంటే మాత్రం రూ.25 వేలు చెల్లించాలని వివరించారు.





విదేశీ అతిథికి ఖ్యాతి..

- ఏటా జిల్లాలోని తేలినీలాపురం ప్రాంతానికి తరలివచ్చే సైబీరియన్ పక్షులపై పోస్టల్ శాఖ 2021 సెప్టెంబర్ 6న ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. దీనికి 'తేలినీలాపురం బర్డ్ శాంచ్యురీ' పేరుతో నామకరణం చేసింది.
- టెక్కలికి చెందిన రియల్స్ సంస్థ నిర్వాహకుడు టీపీ బెనర్జీదాస్ దీనికి సంబంధించిన రుసుమును పోస్టల్ శాఖకు చెల్లించారు.

కవర్‌పై కంచు మోగింది..

జిల్లాలోని సారవకోట మండలం బుడితిలోని కంచు, ఇత్తడి వస్తువుల తయారీ పరిశ్రమలపై పోస్టల్ శాఖ దృష్టి సారించింది. 2022 ఏప్రిల్ 12న బుడితి వస్తువుల ప్రత్యేకతలపై కవర్‌ను విడుదల చేసింది. దీనికి 'బుడితి బెల్ అండ్ బ్రాస్‌మెటల్ క్రాఫ్ట్' అని నామకరణం చేసింది. కంచుగంట, ఇత్తడి, ఇతర లోహాలకు చెందిన దేవతా విగ్రహాలు, కొన్ని చిహ్నాలు, పాత్రల ఫొటోలను కవర్‌పై ముద్రించింది.

- బుడితికి చెందిన ఇత్తడి వస్తువుల తయారీదారుడు కింతాడ ఈశ్వరరావు దీనికి సంబంధించిన రుసుమును పోస్టల్ శాఖకు చెల్లించారు.





పోస్టల్ శాఖ విశిష్ట వ్యక్తులు, ఇతర అంశాలపై ప్రత్యేక కవర్లు, స్టాంపులతో పాటు వినియోగదారులకు కూడా ప్రత్యేక స్టాంప్‌లు ముద్రిస్తోంది.

మీ ఫొటోతో స్టాంప్ కావాలా..

మై స్టాంప్ పేరుతో మీకు నచ్చిన వ్యక్తి ఫొటోతో 12 స్టాంప్‌లను ముద్రించి అందిస్తోంది. కావాలంటే మీరు జిల్లాలోని ప్రధాన తపాలా కార్యాలయాలైన ఆమదాలవలస, టెక్కలి, శ్రీకాకుళం కేంద్రాల్లో సంప్రదించాలి. ఇందుకోసం రూ.300 చెల్లించాలి.

- పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను ఇవ్వాలి. ఆధార్ కార్డు సమర్పించి అప్లికేషన్ పూర్తి చేసి ఇస్తే మీకు స్టాంపుల్ని పోస్టల్ శాఖ అందిస్తుంది.



సర్దార్ సేవలకు సలామ్..

- స్వాతంత్ర్య సమరయోధుడు ఉద్దానం ప్రాంతానికి చెందిన సర్దార్ గౌతు లచ్చన్నపై పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను 2021 అక్టోబర్ 13న విడుదల చేసింది. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోని ముఖ్య ఘటనల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా గౌతు లచ్చన్న పేరుగాంచారు. ఈ ప్రత్యేక కవర్‌ను 'అన్‌సంగ్ హీరోస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అని పోస్టల్ శాఖ నామకరణం చేసింది.
- దీనికి స్పాన్సర్‌గా ఎస్.రామునాయుడు(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) వ్యవహరించారు.

త్వరలో మరో రెండు..



ప్రభుత్వం సూచన మేరకు చారిత్రక ఆధారాలున్న ప్రదేశాలు, రాష్ట్రంలో ప్రత్యేకంగా తయారవుతున్న వస్తువులు, విశిష్ట వ్యక్తులు, ప్రముఖ పర్యాటక ప్రదేశాలపై పోస్టల్ కవర్‌లు ఆవిష్కరిస్తున్నాం. జిల్లాకు చెందిన విశిష్ట వ్యక్తి ప్రముఖ కవి గరిమెళ్ల సత్యనారాయణ, ఉద్దానం జీడిపప్పుపై ప్రత్యేక కవరు విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం.
- వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్



నేతన్నల సృజనను కవర్ చేస్తూ..

గాంధీజీ నుంచి నవతరం వరకు అందరూ ఆ'ధరించి'న.. విశ్వఖ్యాతి గాంచిన పొందూరు ఖాదీపై 2019 డిసెంబర్ 5న ప్రత్యేక కవర్ విడుదల చేసింది. దానిపై రాట్నంతో పాటు గాంధీ మహాత్ముని ఫొటోను ప్రచురించారు. నిపుణులైన నేతగాళ్లు సృజించిన అద్భుతాల ఆనవాళ్లకు దక్కిన గొప్పగౌరవం ఈ కవర్. 'ప్రైడ్ ఆఫ్ పొందూరు.. గాంధీజీస్ చెరఖా' అని పోస్టల్ శాఖ నామకరణం చేసింది.

- పొందూరుకు చెందిన వ్యాపారవేత్త కాకర్ల పైడిలింగం కవర్ ముద్రణకు సహకరించారు.

రైతులు ఆధునీకతను అందిపుచ్చుకోవాలి

- డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ చైర్మన్ సతీష్‌రెడ్డి



నెలివాడలో రైతులతో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

రణస్థలం: మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న కూలీల వేతనాల దృష్ట్యా రైతులు అధునాతన సాంకేతిక పద్ధతుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ చైర్మన్ కె.సతీష్‌రెడ్డి అన్నారు. నెలివాడ, తిరుపతిపాలెం, కోష్ట, పాతర్లపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన ఫౌండేషన్ ద్వారా అమలవుతున్న వివిధ కార్యక్రమాలను పర్యవేక్షించారు. నెలివాడలో తక్కువ నీటితో, దున్నకుండా మొక్కజొన్న సాగు చేస్తున్న రైతుమిత్ర పాండ్రంకి సింహాచలానికి చెందిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. వ్యవసాయంలో పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో కూలీల అవసరం లేకుండా శ్రమ తగ్గించి సమయాన్ని ఆదా చేయడానికి వీలైన సాంకేతికతను అవలంబించాలన్నారు. దీనివలన పెట్టుబడులు తగ్గడమే కాకుండా మేలైన దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. దీని కోసం ఎంపిక చేసిన 24 మండలాల్లో తమ ఫౌండేషన్ ద్వారా వ్యవసాయ సంబంధిత సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నామన్నారు. ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జి.వి.అనురాధా మాట్లాడుతూ.. రైతులందరూ ప్రస్తుత రబీ పంట కాలంలో వరికోతల అనంతరం పర్యావరణ హితమైన దున్నకుండా మొక్కజొన్న సాగు(జీరో టిల్లేజ్) వంటి పద్ధతులను అందిపుచ్చుకోవాలన్నారు. యాంత్రీకరణపై రైతులకు శాస్త్రవేత్తలతో ఎప్పటికప్పుడు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఫౌండేషన్ సీఈవో షామిక్ త్రెహన్ మాట్లాడుతూ.. అటవీ పెంపకం కార్యక్రమంలో భాగంగా కొబ్బరి తోటల్లో అంతర పంటగా వివిధ రకాల అంతర పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. కోష్ట హైస్కూల్లో విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడారు. భాషా నైపుణ్యాలను, ఆంగ్ల భాషా అధ్యయనంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాతర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఫౌండేషన్ ద్వారా చేపట్టిన వసతులు, వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ సీనియర్ డైరెక్టర్ కె.వి.ఎస్.ఎన్.రాజు, ఫౌండేషన్ సీవోవో ప్రణవ్ చౌదరి, సీనియర్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..!

జిల్లాను మంచు దుప్పటి కమ్మేసింది. బుధవారం ఉదయం 8.30 గంటల వరకు దట్టమైన మంచు కురవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలుచోట్ల వాహనచోదకులు లైట్లు వేసి మరీ ప్రయాణాలు సాగించాల్సి వచ్చింది. ప్రధానంగా జిల్లా కేంద్రం, పరిసర ప్రాంతాల్లో విపరీతంగా మంచు కురవడంతో వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్న వారు ఇబ్బందులు పడ్డారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం





గ్రానైట్ బ్లాకులు పట్టివేత



కోటబొమ్మాళిలో విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ బ్లాకులు

కోటబొమ్మాళి: ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి కోటబొమ్మాళి మండలం నిమ్మాడ జంక్షన్‌లోని పలు స్టోన్ కటింగ్ పరిశ్రమలకు పాత వే బిల్లులతో నాలుగు లారీల్లో తరలిస్తున్న 8 గ్రానైట్ బ్లాకులను కోటబొమ్మాళి సమీపంలోని చలమయ్యపేట వద్ద బుధవారం వేకువజామున శ్రీకాకుళం విజిలెన్సు అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. రాత్రి వేళల్లో అక్రమరవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు రీజినల్ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాలతో ఈ తనిఖీలు చేపట్టినట్లు విజిలెన్సు మైన్స్ ఏజీ ఎం.సురేష్‌కుమార్, ఎస్ఐ అశోక్ తెలిపారు. లారీలు, గ్రానైట్ బ్లాకులను కోటబొమ్మాళి పోలీసుస్టేషన్‌కు తరలించామని చెప్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

17 మంది బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

ఆమదాలవలస రూరల్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ స్పష్టం చేశారు. ఆమదాలవలస తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు కార్డును ఆధార్ అనుసంధానం చేయడంలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని చెప్పారు. అర్హత గల యువతీ యువకులను గుర్తించి కొత్తగా ఓటుహక్కు నమోదు చేయాలని ఆదేశించారు. చాలాచోట్ల బీఎల్వోలు అందుబాటులో లేకపోవడంతో ఓటరు నమోదు నత్తనడకగా సాగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో 50 శాతం కన్నా తక్కువ పురోగతి కలిగిన బీఎల్‌ఓలపై విచారణ జరపాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించిన 17 మంది బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ గణపతి, ఎన్నికల డీటీ నాయక్, వీఆర్వోలు పాల్గొన్నారు.

బౌద్ధారామాలను సందర్శించిన కేంద్ర బృందం



శాలిహుండంలో కేంద్ర బృంద సభ్యులు

గార: శాలిహుండం బౌద్ధారామాలను ఎన్‌ఆర్‌జీఎస్ కేంద్ర బృంద సభ్యులు బుధవారం సాయంత్రం సందర్శించారు. సభ్యులు గిరిజా విజయ్ శంకర్‌పాడి, సత్యరాజ్ రౌతు, డాక్టర్ చక్రపాణి, పాణిగ్రహీలు జిల్లా పర్యటనలో భాగంగా బౌద్ధారామాల ను సందర్శించారు. అనంతరం శ్రీకూర్మనాథున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్య క్రమంలో ఏపీవో సంధ్యారాణి, సిబ్బంది ఉన్నారు.

ప్రతి మంగళవారం 'రిజిస్ట్రేషన్ నేస్తం'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 'రిజిస్ట్రేషన్ నేస్తం' పేరుతో ప్రతి మంగళవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేస్తామని పేర్కొన్నారు. ఫోన్ ఇన్ కోసం 08942-279422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మందస పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

మందస: జిల్లాలో మావోయిస్ట్ ప్రభావిత మండలమైన మందసలో అత్యంత పటిష్ట భద్రత మధ్య పోలీసు స్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్టు ఎస్పీ జి.ఆర్.రాధిక చెప్పారు. మందస పట్టణంలో పాత పోలీసు క్వార్టర్ వద్ద నిర్మిస్తున్న పోలీసు స్టేషన్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో భాగంగా మందస పోలీసు స్టేషన్ నిర్మాణానికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఆరు నెలల్లో పోలీసు స్టేషన్ పూర్తి చేసి మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం వాసుదేవ పెరుమాళ్ ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. క్రైం జిల్లా ఏఎస్పీ టి.వి.ఠలేశ్వర్, కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి, కాశీబుగ్గ రూరల్ సీఐ కె.శంకరరావు, మందస ఎస్ఐ వై.రవికుమార్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వెంకటరెడ్డి, ఏఈ జి.తరుణ్, ఎం.లక్ష్మీనారాయణ, ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ కొర్నాని ఆదినారాయణ, సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి, ఎంపీటీసీ కంచి బెహరా తదితరులు పాల్గొన్నారు.

దారి చూపాలని వినతి..

కాగా, స్టేషన్ నిర్మాణం కారణంగా గాయత్రినగర్ ఇళ్లకు దారి లేకుండా పోతోందని స్థానికులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్తూ గేట్లు ఏర్పాటు చేసి, ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే దారి ఇవ్వగలమన్నారు. సెక్యూరిటీ పరంగా ఇబ్బందులు ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు పందిరిరాట



శ్రీముఖలింగం ధ్వజస్తంభం వద్ద పందిరిరాట వేస్తున్న దృశ్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఈ నెల 18 నుంచి 20 వరకూ జరగనున్న శ్రీముఖలింగేశ్వరుని మహా శివరాత్రి ఉత్సవాలకు శుభముహూర్తం ఖరారైంది. ఉత్సవాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా అంతా శుభం జరిగేందుకు బుధవారం ఆలయ అధికారులు, అర్చకులు ప్రధాన ముఖద్వారం, ధ్వజస్తంభం వద్ద పందిరిరాట వేశారు. అలాగే విద్యుత్, క్యూలైన్లు, అలంకరణ, గర్భగుడిలో ముఖ్యమైన పనులకు శ్రీకారం చుట్టారు. నంది, ఐరావతం, పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను శుద్ధి చేసే పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓ పి.ప్రభాకరరావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కె.హరిప్రసాద్, పురోహితులు బంకుపల్లి భూషణశర్మ తదితరులు పాల్గొన్నారు.